క్లుప్తంగా

నిరంతరం నిఘా ఉంచాలి

తిరువూరు: ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం అక్రమ రవాణ అరికట్టడానికి సరిహద్దుల్లో చెక్‌పోస్టులో నిరంతరం నిఘా ఉంచాలని విజయవాడ పోలీస్ కమిషనరేట్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం తిరువూరు సమీపంలోని అష్టలక్ష్మీ ఆలయం సెంటర్లో, రాజుగూడెంలో ఏర్పాటు చేసిన సమీకృత సరిహద్దు చెక్‌పోస్టును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలని ఆదేశించారు. ఏసీపీ మురళీమోహన్, తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

తిరువూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లక్ష్మీపురంలో ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. తిరువూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మాధవి ఆదేశాల మేరకు ఈ చెక్‌పోస్టు ఇన్‌చార్జిగా ఏకొండూరు మండల పరిషత్ కార్యాలయ ఏవో విష్ణు నియమితులయ్యారు. ఎన్నికలు ముగిసేవరకు ఈ చెక్‌పోస్టు కొనసాగుతుంది.

ఎన్నికల హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తిరువూరు: ఎన్నికల సందర్భంగా తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి మాధవి తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉల్లంఘన, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను రిటర్నింగ్ అధికారికి 08673251235 నంబరుకు తెలియజేయవచ్చని సూచించారు.

సురక్ష వైద్య శిబిరం పరిశీలన

చాట్రాయి: సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మంగా కుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నంపేటలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఆశ్రం ఆస్పత్రి వైద్యురాలు ఎం.సంఘమిత్ర, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాదు, ప్రవీణ చంద్ర, ఈవోపీఆర్‌డి మురళీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏఎన్ఎంలు, పిహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థి ప్రతిభ

నూజివీడు: ప్రత్యేక అవసరాల పిల్లలకు జాతీయస్థాయిలో న్యూఢిల్లీలో ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో పోతురెడ్డిపల్లికి చెందిన పర్వతనేని రాకేస్ ప్రతిభ కనబరిచాడు. షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానంలో నిలిచి స్వర్ణ, రజత పతకాలు సాధించాడు.

గోల్డ్ కాయిన్ అందజేత

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం లో పాలకేంద్రంలో పాలు పోస్తున్న పాల ఉత్పత్తిదారులుగొర్ల వరలక్ష్మి కుమార్తె వర్షిణి వివాహం సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు పథకంలో రూ.20 వేలు విలువ చేసే గోల్డ్ కాయిన్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణామిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యురాలు నెక్కళపు వాణిశ్రీ, తిరువూరు క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి, సంఘ అధ్యక్షురాలు కె.అనసూయ, సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాల విద్యార్థినులు నీటి వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జనార్థన్ మాట్లాడుతూ మానవ మనుగడకు నీరు ప్రధాన ఆధారం అన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత తీసుకుని వర్షంనీరు, వాడుక నీటిని నిల్వ చేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యప్రకాష్

నూజివీడు: నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఇందుపల్లి సత్య ప్రకాష్, మడుపల్లి మధు రవిశంకర్ ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు జరగ్గా ఇందుపల్లి సత్యప్రకాష్ మాటూరి రవికాంత్‌పై 25 ఓట్ల ఆధిక్యతతో ఎన్నికయ్యారు. కార్యదర్శి పదవికి మడుపల్లి మధుర విశంకర్ తన అభ్యర్థి వై.సుధాకర్‌పై 35 ఓట్ల ఆధిక్యతతోఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మల్లవల్లి రమేష్, సంయుక్త కార్యదర్శిగా అక్కినేని రమాకుమారి, కోశాధికారిగా బసవరాజు ఫణికుమార్, లైబ్రేరియన్‌గా దుర్గారావు, మహిళా ప్రతినిధిగా పద్మాంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా భోగోలు చంద్రశేఖర్ వ్యవహరించారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి, పక్కన సర్నాల తిరుపతిరావు, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

మైలవరం: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ పరిశీలకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, ఒక సామాన్య కార్యకర్తను అసెంబ్లీకి పంపాలన్న ఉద్దేశంతో యాదవ సామాజిక వర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావును మైలవరం అభ్యర్థిగా ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అభిమానించి వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. కొన్ని సోషల్ మీడియా చానల్స్‌లో పార్టీకి చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా ఊహాగానాలతో వార్తలు పెట్టడం సమంజసం కాదన్నారు. మైలవరం నియోజకవర్గం పెద్ద నియోజకవర్గం కావడం, అత్యధికంగా ఓటర్లు ఉన్నందున తనను నియోజకవర్గానికి రెండవ పరిశీలకుడిగా నియమించారని కానీ కొన్ని సోషల్ మీడియా వారు వక్రీకరించి వార్తలు పెడుతున్నారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మళ్లీ పట్టం కట్టాలి

రెడ్డిగూడెం: పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ అన్నారు. మండలంలోని అన్నేరావుపేట, మద్దులపర్వ, శ్రీరామపురం, ముచ్చనపల్లి, కూనపరాజుపర్వ, కుదప గ్రామాలలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ పేదవారి ముఖంలో చిరునవ్వు చూడాలని పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి తుచ తప్పకుండా అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపాలనతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంను చేయటానికి ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బలగాని తిరుపతిరావు, మండల సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల కమిటీ చైర్మన్ ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మైలమాల కాంతారావు, రామినేని వీరస్వామినాయుడు, జమలారెడ్డి, తిరుపతిరావు, తోటకూర రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మద్దులపర్వలో కార్యకర్తలతో తిరుపతిరావు

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

ఆర్డీఓ వై.భవానీశంకరి



నూజివీడులో మాట్లాడుతున్న ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ వై.భవానీశంకరి హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వ్యక్తిగత వాహనాలపై స్టిక్కర్లు అంటించుకోవాలన్నా, ఇళ్లపై జెండాలు కట్టాలన్నా ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు తొలగించడానికి 72 గంటల సమయం ఇచ్చామని ఇంకా ఎక్కడైనా ఉంటే వెంటనే తొలగిస్తామన్నారు. రాజకీయ పక్షాలన్నీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ర్యాలీలు, సభలకు ముందుగానే అనుమతి తీసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్ద ఉండి ఓటు వేసే సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. సువిధ యాప్ ఈ ఎన్నికల ప్రక్రియలో కీలకమైనదని ఎన్నికల ప్రచారాలు, సమావేశాలు, సభలు, ఊరేగింపులు, ర్యాలీలు తదితర 26 అంశాలకు సంబంధించిన అనుమతులన్నీ సువిధ యాప్ ద్వారానే మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ జీ లక్ష్మయ్య, పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, తహసీల్దార్ ఏ విశ్వనాథశాస్త్రి, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత పగడాల సత్యనారాయణ, టీడీపీ నేత చెరుకూరి దుర్గాప్రసాద్, సీపీఎం నేత జీ రాజు, బీజేపీ నేత గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలని డీఎస్పీ జి.లక్ష్మయ్య అన్నారు. ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్‌ఓలకు, మహిళా పోలీస్ సిబ్బందికి ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా అధికారులు దృష్టి సారించాలని అన్నారు. నూజివీడు డివిజన్‌లో 116 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు గుర్తించామని ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎంపీడీఓ శామ్యూల్, తహసీల్దార్ మృత్యుంజయరావు, ఏఎస్ఐ నాయక్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికల నియమావళిపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సభలు, సమావేశాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందేలా చూడాలన్నారు. కులమత, ప్రాంతీయ, భాషా భేదాలతో ఓట్లు అడగకూడదన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేలా సహకరించాలని సూచించారు. సీ విజిల్, సువిధ, స్వీప్ యాప్‌లపై అవగాహన ఉండాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించాలన్నారు. విస్తర్ణాధికారి మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాబూ..నిన్ను, నీ కొడుకును ఎలా నమ్మాలి?

- దేవినేని ఉమాకు సీటు ఇవ్వకపోవడంపై ఆగ్రహావేశాలు
- చంద్రబాబు ఫెయిల్యూర్ నాయకుడు
- పార్టీకి వ్యతిరేకంగా చేయాల్సి వస్తుంది

భవానీపురం(భవానీపురం పశ్చిమ): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మైలవరం నియోజకవర్గం సీటు కాకరేపుతోంది. ఇటు టీడీపీ అటు జనసేన పార్టీల్లో అసంతృప్తులు పెరిగిపోతున్నాయి. సీటు రానివారు ఇండిపెండెంట్లుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల్లో భాగంగా మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా దేవినేని ఉమామహేశ్వరరావు పేరు టీడీపీ అధిష్టానం ప్రకటించక పోవడంపై గొల్లపూడిలో పార్టీ శ్రేణులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. వసంత కృష్ణప్రసాద్ పేరు ప్రకటించడంతో శుక్రవారం ఉమా అభిమానులు గొల్లపూడిలోని ఆయన కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. మైలవరం నియోజకవర్గ అభ్యర్థిగా ఉమా కాకుండా వేరొకరిని ఊహించుకోలేమని కార్యకర్తలు అంటున్నారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా అయినా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పార్టీని హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంగా గొల్లపూడి గ్రామానికి చెందిన నర్రా క్రాంతి అనే మహిళ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రశ్నల వర్షం కురిపించారు.

ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా పార్టీకి అండదండలుగా ఉంటూ ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన ఉమాకు మైలవరం సీటు ఇవ్వకపోవడం చంద్రబాబు చేసిన ఘోరమైన తప్పిదం. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేని తీసుకువచ్చి ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా నిలబెట్టటమేమిటి మా ఖర్మ కాకపోతే. అంతకంటే మంచి అభ్యర్థి టీడీపీలో లేరా? ఇది తన ఫెయిల్యూర్ అని బాబు ఒప్పుకుంటున్నారా? ఇదేం ఖర్మ కార్యక్రమానికి పార్టీ పిలుపునిస్తే భుజాన వేసుకుని చేస్తే ఉమాను పక్కన పెట్టడం ఇదేం ఖర్మ బాబూ మాకు. మీరు జైలుకు వెళ్లి బయటకు వచ్చే వరకు ఎన్ని ధర్నాలు చేశామో గుర్తు లేదా? ..ఎన్ని ధర్నాలు చేశాం? మీ దారిలో నడిచిన మమ్మల్ని అవమానపరిచారు. బాబు, లోకేష్‌ల పని అయిపోయిందని అందరూ వ్యాఖ్యానించటం నిజమేనా? ఇక మిమ్మల్ని, లోకేష్‌ను ఎలా నమ్ముతాం. మీ 2029 విజనరీ ఏమైపోయింది బాబు? ఉమాకు సీటివ్వక పోవడం చారిత్రాత్మక తప్పిదం అవుతుంది. మైలవరం టీడీపీ సీటు ఓడిపోవడం ఖాయం. అవసరమైతే పార్టీకి వ్యతిరేకంగా పని చేయాల్సిన పరిస్థితి వస్తుంది. పొత్తులో భాగంగా మైలవరం నియోజకవర్గం సీటు తనకు ఇవ్వకపోవడంపై జనసేన నాయకుడు అక్కల గాంధికూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

నిరాశతో దేవినేని ఉమ బలప్రదర్శన



సీటు దక్కించుకున్న వసంత వర్గం విజయోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీకి చెందిన ఇరువురు బడా నేతల బలప్రదర్శనకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీ వేదికగా మారింది. మాజీ మంత్రి దేవినేని ఉమమహేశ్వరరావుకు టీడీపీ అధిష్టానం మైలవరం నియోకవర్గం టికెట్ ఇవ్వకపోవడంతో పార్టీకి వ్యతిరేకంగా పని చేయాల్సి పరిస్థితి ఉంటుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో దేవినేని ఉమ శుక్రవారం సాయంత్రం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో పార్టీ శ్రేణులతో కలిసి బలప్రదర్శనకు దిగారు. ఇదంతా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లటమే ధ్యేయంగా ఆయన ఈ ప్రదర్శనకు దిగినట్లు సమాచారం. పార్టీ జెండాలు, ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్ వంటి నాయకుల ఫొటోలు, పార్టీ జెండాలు లేకుండా మందీమార్బలాన్ని వెంటేసుకుని కాలనీలో తిరిగారు. కాగా అనుచర గణమంతా దేవినేని ఉమ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.

వసంత అనుచరుల విజయోత్సవ ర్యాలీ

మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వసంత కృష్ణప్రసాద్ పేరును టీడీపీ అధిష్టానం ప్రకటించడంతో ఆయన అనుచరులంతా పార్టీ జెండాలను చేతబట్టుకుని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో విజయోత్సవ ర్యాలీ జరిపారు. మొత్తం మీద ఒక వైపు ఉమా బలప్రదర్శన మరో వైపు వసంత విజయోత్సవ ర్యాలీతో కాలనీవాసులు అయోమయంలో పడ్డారు. దేవినేని ఉమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

40 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేతనకొండ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నర్రి శ్రీను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ పాపారావుకు శుక్రవారం వచ్చిన సమాచారం మేరకు నర్రి శ్రీను ఇంటి వద్ద తనిఖీ చేయగా వివిధ రకాల మద్యం సీసాలు 40 లభించాయి. వీటి విలువ సుమారు రూ.6,600 వరకు ఉంటుంది. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

ముసునూరు: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోనికి వచ్చిందని, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకర్లకు నియమాళి వివరాలు తెలిపారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది, వీడియో గ్రాఫర్‌తో కూడిన మండల పర్యవేక్షణ కమిటీ నిరంతర పరిశీలన చేస్తుందని తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాలలోని వివిధ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించినట్లు తెలిపారు. అనుమతిలేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, లౌడ్ స్పీకర్లతో ప్రచారాలు నిర్వహించడానికి వీలు లేదన్నారు. ప్రతి కార్యక్రమానికి సువిధ పోర్టల్ ద్వారా అనుమతి పొందాలన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశాలు

జి.కొండూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శనివారం సమావేశమవుతారని మైలవరం పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మండలంలోని కోడూరు, చిన్ననంది గామ, వెల్లటూరు, కందులపాడు, ముత్యాలంపాడు, ఆత్కూరు, పినపాక, కట్టుబడిపాలెం, జి.కొండూరు గ్రామాలలో సమావేశాలు జరుగుతాయని వివరించారు.

భూగర్భ జలాలను కాపాడుకోవాలి

మైలవరం: భూగర్భ జలాలు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రకృతి క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవ అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ప్రకృతి-ఎన్విరాన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థులకు భూగర్భ జలాల ప్రాముఖ్యతను పోస్టర్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలు పెంచడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం, రసాయన ఎరువులు వాడకుండా ఉడటం తదితర పద్ధతులను వివరించారు. ప్రకృతి క్లబ్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ షాహీదా నీలోఫర్, డాక్టర్ వి.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పర్యటన



చౌటపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న సుధారాణి

తిరువూరు: మండలంలోని చౌటపల్లిలో వైఎస్సార్ సీపీ తరపున జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఆమె వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలను కలిసిన సుధారాణి మళ్లీ వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, సర్పంచి రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుడిపూడి నారాయణరావు, తాళ్ళూరి నవీన్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, పార్టీ నాయకులు కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిష్కళంక మాత ఉత్సవాలు



వాక్యోపదేశం అందిస్తున్న లాము జయరాజు

ముసునూరు: కథోలిక విశ్వాసుల స్తోత్రగానాలు, దీక్షాధారుల జపమాల ఆరాధనలు, గురువుల దివ్యపూజా బలిఅర్పణలతో నెహ్రూనగర్ ప్రాంతం మార్మోగింది. ముసునూరు విచారణ పరిధిలోని నెహ్రూనగర్‌లో పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జోసఫ్ తంబి ఓఎమ్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న నిష్కళంకమాత మహోత్సవాలు రెండో రోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రమణక్కపేట విచారణకర్తలు ఫాదర్ జాన్‌భారతి, రెవరెండ్ ఫాదర్ రాజశేఖర్ దివ్యబలిపూజ ఆరాధనలు నిర్వహించారు. ముఖ్యఅతిథి నూజివీడు పట్టణ విచారణకర్త రెవరెండ్ లాము జయరాజు వాక్య సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ భక్తి, శ్రద్ధలతో ప్రభువును ఆరాధించాలని సూచించారు. క్రీస్తు ప్రభువు చేసిన అద్భుత కార్యాలకు ప్రత్యక్ష సాక్షిగా మేరీమాత నిలిచారని, ఆమెను గౌరవించి, ఆరాధించడం మనందరి బాధ్యతగా పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఊటుకూరులో పోలింగ్ కేంద్రం వద్ద సూచనలు ఇస్తున్న శ్రీనివాసరావు

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని ఊటుకూరు, పెనుగొలనులోని పలు పోలింగ్ కేంద్రాలను, రాజవరం బోర్డర్ చెక్‌పోస్టును పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ రూరల్ జోన్ డీసీపీ శ్రీనివాసరావు, మైలవరం ఏసీపీ మురళి, ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు తీసుకోవలసిన చర్యలను తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ ఎస్.శ్రీనుకు వివరించారు. రాజవరం చెక్‌పోస్టును పరిశీలించిన అధికారులు అక్రమ నగదు, మద్యం రవాణ అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు.

నీటిని సక్రమంగా వినియోగించాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ అరవపల్లి రాము

నూజివీడు: మంచినీటి వనరుల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజెప్పేందుకే ప్రతి ఏటా మార్చి 22న ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని డ్వామా ఏలూరు పీడీ అరవపల్లి రాము అన్నారు. పట్టణంలోని ఉపాధిహామీ పథకం కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాము మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నేటికి ఇంకా 14 శాతం జనాభాకు సురక్షిత మంచినీరు లభించడంలేదన్నారు. అత్యంత విలువైన వనరులలో నీరు ఒకటని, దీనిని భావి తరాల వారికి అందించాల్సిన ఆవశ్యకత నేటితరంపై ఉందన్నారు. బాధ్యతాయుతమైన నీటి వినియోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలన్నారు. దీనిపై విద్యార్థి దశనుంచే చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోను, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటను ఏర్పాటు చేసి వర్షపునీటిని భూమిలో ఇంకేలా చేసి భూగర్భ జలాలను పెంచుకోవచ్చన్నారు. సమావేశంలో ఏపీడీ శ్రీదేవి, ఏపీవో సోమేశ్వరి, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

తిరువూరు: స్థానిక ఆస్టర్ రమేష్ అమరావతి ఆసుపత్రిలో ఈ నెల 24న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ కోనేరు వెంకటకృష్ణన్ తెలిపారు. గుండె సంబంధ వ్యాధులు, చిన్నపిల్లల జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు, మెదడు, నరాల సంబంధ సమస్యలు, వెన్నెముక, థైరాయిడ్, మధుమేహ, జీర్ణకోశ, కీళ్ల వాత వ్యాధులకు ప్రత్యేక నిపుణులు చికిత్స చేస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, ఎకో కార్డియోగ్రాం, పల్మనరీ ఫంక్షన్, లివర్‌ఫైబ్రో స్కాన్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు వెల్లడించారు. వైద్య చికిత్స పొందదలచినవారు 96521 96997, 95536 62539 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దంత సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కనిమెర్ల తండా(మైలవరం): ప్రతి ఒక్కరూ దంత సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ ఎస్.వరుణ ప్రియాంక తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ వరుణ ప్రియాంకతో పాటు దంత వైద్యులు గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళాశాల డీన్ డాక్టర్ పిచ్చిరెడ్డి, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో

ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం డీఈఓ అబ్రహం పరిశీలించారు. ప్రతి తరగతి గదినీ ఆయన తనిఖీ చేశారు. ఏర్పాటు పరిశీలించి సూచనలు చేశారు. మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. నిర్వహించిన గణిత పరీక్షకు 643 మంది విద్యార్థులకు 21 మంది గైర్హాజరయ్యారు.

రేపు రంగనాయక స్వామి కల్యాణం

తిరువూరు: స్థానిక శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దారా రంగారావు తెలిపారు. 23 నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 24న సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరుపుతామన్నారు. ఆలయంలో కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులకు తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.